RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 135 | ఏప్రిల్ 20, 2025 | వెల : రూ.3-00



కార్యశీలురు.. మనోహర్‌రావు

4లో..



తెలంగాణకు పరిశ్రమలు రావాలి..

## పెట్టుబడులు పెరగాలి

### జపాన్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి:**

తెలంగాణకు పరిశ్రమలు రావాలి పెట్టుబడులు పెంచాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధించడానికి ప్రవాసులు ఎవరికి చేతనైనంత వారు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.జపాన్ దేశ పర్యటనలో భాగంగా టోక్యో నగరంలో 'జపాన్ తెలుగు సమాఖ్య' ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణను అభివృద్ధి చేసుకుందామని ఈ సందర్భంగా చెప్పారు. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం ఎంతో ఉంటుందని అన్నారు.న్యూయార్క్‌లో హడ్సన్ రివర్ ఫ్రంట్, లండన్‌లో థేమ్స్, సియోల్ నగరంలో రివర్ ఫ్రంట్లతో పాటు టోక్యో నగరంలో వాటర్ ఫ్రంట్లను పరిశీలించామని, ఇదే కోవలో హైదరాబాద్ నగర అభివృద్ధికి మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టామని అన్నారు. కాలుష్యం కారణంగా ఢిల్లీ నగరం స్తంభించిపోయే పరిస్థితులను గమనిస్తున్నాం, ఇలాంటి పరిస్థితుల నుంచి గుణపాఠం నేర్చుకోవలసిన అవసం ఉందనన్నారు.మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల వంటి ప్రాజెక్టులు తెలంగాణ పురోగతికి అత్యంత కీలకమైన అంశాలని పేర్కొన్నారు. ఐటీ, ఫార్మా వంటి రంగాల్లో సాధించాల్సినంత ప్రగతి సాధించామని, ఇతర రంగాల్లో అభివృద్ధి సాధించాలని చెప్పారు. ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణ అభివృద్ధి సాధించడంలో అందరి సహకారం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జపాన్ తెలుగు సమాఖ్య ప్రతినిధులు, టోక్యో నగరంలో స్థిరపడిన ప్రవాస తెలుగు వారు పాల్గొన్నారు.



## కేసీఆర్ స్పీచ్‌పైనే

# ఆశలు!

- రజతోత్సవ సభ కోసం 'గులాబీ' శ్రేణుల వెయిటింగ్!
- ఉద్యమకాలం నాటి తరహా ఉపన్యాసం ఉంటుందా?
- భారీ బహిరంగ సభ ఏర్పాట్లలో ఉమ్మడి వరంగల్ బీఆర్ఎస్ నేతలు నిమగ్నం
- సక్సెస్ చేయడం కోసం సర్వశక్తులను ఒడ్డే ప్రయత్నం..ఎల్కతుర్తిలో మీటింగ్
- రాష్ట్ర సర్కారుపై మాజీ సీఎం ఏ విధమైన విమర్శలు చేస్తారనే ఉత్కంఠ
- సభ ఏర్పాట్లు, ఇతరాలను నిశితంగా పరిశీలిస్తున్న ఇంటెలిజెన్స్ వర్గాలు!

**వేద న్యూస్, ఫోకస్ టీమ్ :**

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల 27న భారీ బహిరంగ సభకు ఆ పార్టీ లీడర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. హనుమకొండ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తి మండల కేంద్రం సమీపంలోని రైతుల భూములను వేదికగా ఎంపిక చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో ఉమ్మడి వరంగల్ జిల్లా గులాబీ పార్టీ నేతలు పూర్తిగా నిమగ్నమయ్యారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, గులాబీ పార్టీ కార్యకర్తలు సైతం రజతోత్సవ సభలో కేసీఆర్ స్పీచ్ కోసం ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ శ్రేణులు అయితే ఉద్యమ కాలం నాటి నాయకుడి తరహాలో కేసీఆర్.. సామెతలతో సందర్భోచితంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దునుమాడే విధంగా ఉపన్యాసం ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నారు. కేసీఆర్ ప్రసంగంపైనే బీఆర్ఎస్ శ్రేణులు ఆశలు పెట్టుకున్నట్టుగా ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తమ పార్టీ అధినేత స్పీచ్ ద్వారా పార్టీలో ఉత్సాహం, ఉత్తేజం నింపబడుతుందని నేతలు, కార్యకర్తలు కొందరు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**పార్టీ శ్రేణులు, ప్రజల్లో జోష్ నింపేలా స్పీచ్..!**

2001 ఏప్రిల్ 27న ఆవిర్భవించిన 'గులాబీ' పార్టీ.. ఉద్యమ పార్టీగా ప్రజల్లో పేరుగాంచింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పదేండ్ల పాటు కేసీఆర్ సీఎంగా సేవలందించారు. 2023 అసెంబ్లీ, 2024 పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం 'కారు'కు బ్రేకులు పడ్డాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 27న జరిగే రజతోత్సవ సభలో పార్టీ శ్రేణులు, ప్రజల్లో జోష్ నింపే విధంగా కేసీఆర్ ఉపన్యాసం ఉండబోతున్నదని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే, కేసీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న క్రమంలో ఏయే అంశాలను ప్రాతిపదికగా తీసుకుంటారు.. మళ్లీ పక్క రాష్ట్ర నాయకుడు చంద్రబాబు నాయుడును బూచిగా చూపిస్తారా? పదేండ్ల కాలంలో తాను చేసిన అభివృద్ధి పనులు ప్రస్తావిస్తారా? కాంగ్రెస్ 15 నెలల పాలన వైఫల్యాలను ఎత్తి చూపుతారా? ప్రజల ముందర ఏయే ప్రశ్నలను లేవనెత్తుతారు? వంటి విషయాలు ఆసక్తికరంగా మారాయి. సభకు సంబంధించిన ఏర్పాట్లతో పాటు మాజీ సీఎం కేసీఆర్ సభ సందర్భంగా చేయబోయే సూచనలు, సలహాలతో పాటు ఆ రోజు వరకు ఇంటెలిజెన్స్ వర్గాలు నిశితంగా పరిశీలిస్తూ.. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి చేరవేస్తున్నట్టుగా తెలుస్తోంది. పార్టీతో పాటు ప్రజలకు దిశానిర్దేశం చేసే వేదికగా రజతోత్సవ సభను కేసీఆర్ ఎంచుకున్నట్టుగా వినికిడి. ఈ నేపథ్యంలోనే మాజీ సీఎం.. స్పీచ్‌ను పకడ్బందీగా అన్ని అంశాలు స్పృశించే విధంగా.. సందర్భోచితంగా ప్రజల్లో.. ఉత్సాహం కలిగేలా.. సూటిగా జనంలోకి చొచ్చుకుపోయేలా 'గులాబీ' లీడర్లు ప్రిపేర్ చేస్తున్నట్టు టాక్.. ప్రతిపక్ష నేతగా, బీఆర్ఎస్ అధినేతగా, పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన నాయకుడిగా కేసీఆర్ రజతోత్సవ సభలో ఏ సందేశం ఇవ్వబోతున్నారని రాజకీయ వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఉత్కంఠగా, ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## మమతా బెనర్జీ దిష్టిబొమ్మ దగ్ధం..!

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి:**

పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు హింసకాండకు నిరసనగా మీర్పేట్ చౌరస్తా వద్ద మమత బెనర్జీ దిష్టి బొమ్మను డీజేవైఎం ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు తులసి ముఖేష్ ముదిరాజ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కాశిరెడ్డి వెంకట్రెడ్డి, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు రాఘవేందర్, దాసు, గోలి శ్రీనివా సరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, విక్కీ, సాగర్, రాజేష్, రఘు, కిషోర్, ప్రదీప్, శశి, ప్రమోద్, నిఖిల్, మనీష్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై

**ప్రత్యేక దృష్టి పెట్టాలి**

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

4లో..




## మాది పోరుగల్లు.. పోరాడి సాధించుకుంటాం..

- మేము పోరాడేది మా హక్కుల కోసమే
- రాజ్యాంగబద్ధంగా పోరాడుతున్నాం
- న్యాయం జరిగే వరకు పోరాడుతాం
- వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు




**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

మాది తెలంగాణ రాష్ట్రం..అందులో పోరాటాలకు గడ్డ అయినా ఓరుగల్లు ముద్దుబిడ్డలం..పోరాడుతాం..మా హక్కుల కోసం..రాజ్యాంగబద్ధంగా పోరాడుతాం.. న్యాయంగా పోరాడుతాం..అనుకున్నది సాధిస్తాం..జర్నలిస్టుల చిరకాల కోరిక అయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు సాధించి తీరుతామని వరంగల్ తూర్పు జర్నలిస్టులు ధీమా వ్యక్తం చేశారు. డబల్ బెడ్ రూమ్ సాధనకై దేశాయిపేట లక్ష్మీ మెగా టౌన్షిప్ లోని గత ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ముందు నిర్వహించిన నిరాహార దీక్ష శనివారం ఆరవ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు. జర్నలిస్టులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చేవరకు తాము కూడా పోరాడుతామని ఈ సందర్భంగా తెలిపారు.



డంపింగ్ యార్డ్ తరలించాలంటూ

## 6000 పోస్టు కార్డులు

### సీఎంకి పంపిన మడికొండ, రాంపూర్ విద్యార్థి లోకం, పాఠశాల యాజమాన్యాలు

**వేద న్యూస్, మడికొండ :**

మడికొండ, రాంపూర్ మధ్యలో ఉన్నటువంటి డంపింగ్ యార్డ్ ను ఎత్తివేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి కి స్థానిక పాఠశాలలు, కార్పొరేటర్ ఆవాల రాధిక రెడ్డి 6000 పోస్టుకార్డులను పంపించారు. పోస్ట్ కార్డులను పంపిన వారిలో మడికొండ, రాంపూర్ కు సంబంధించిన మడికొండ గవర్నమెంట్ స్కూల్ విద్యార్థులు టీచర్లు, నవోదయ విద్యానికేతన్ స్కూల్, సెయింట్ మాథ్యూస్ స్కూల్, సక్సెస్ స్కూల్, రామన్ స్కూల్, రైజింగ్ ఇండియన్ టెక్నో స్కూల్, మాస్టర్ జి స్కూల్, ఏకశిలా హై స్కూల్, రాంపూర్ గవర్నమెంట్ స్కూల్, మడికొండ లోటస్ సాఫ్ట్వేర్ సంస్థ యాజమాన్యం, మడికొండ రాంపూర్, మహిళా సంఘాలు, డ్వాక్రా సంఘాలు, కుల సంఘాలు, ప్రజలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డంపింగ్ యార్డ్ నిర్మూలన కమిటీ సభ్యులు, మడికొండ, రాంపూర్ ప్రజలు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభ ప్రాంగణాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నేతలు



**వేద న్యూస్, హన్మకొండ :**

ఏప్రిల్ 27న ఎల్కతుర్తి, హనుమకొండ లో జరుగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రాంగనాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర శనివారం సందర్శిం చడం జరిగింది.ఈ సభ ఏర్పాటు, పార్కింగ్, స్టేజి తదితరులు పనులను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ,27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సుమారు పది నుంచి పదిహేను లక్షల వరకు తెలంగాణ నలుమూలల నుంచి ప్రజలు పాల్గొంటారు అని అంచనా ఉన్నట్లు తెలిపారు. కనీ వీని ఎరుగని రీతిలో ఈ సభ జరుగుతుంది అని వద్దిరాజు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఎంపీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం ఏప్రిల్ 20, 2025

# శాంతి స్థాపన జరగాలి..!

**– డివైన్ గ్రేస్ అసెంబ్లీ ఆధ్వర్యంలో ఘనంగా రన్ ఫర్ జీసస్ ర్యాలీ**





**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగలను పురస్కరించుకొని వరంగల్ నగరంలోని డివైన్ గ్రేస్ అసెంబ్లీ పాస్టర్ రమేష్ పాల్ ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నగరంలోని నాయుడు పెట్రోల్ పంప్ జంక్షన్ లో పాస్టర్ రమేష్ పాల్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మానవాళి రక్షణ కోసం యేసు ఈలోకంలో జన్మించారని, అందరిని సమానంగా చూడాలని, ప్రేమ, కరుణ భావాలతో మెలగాలని, సేవతో ఉండాలని చెప్పిన కరుణమయుడన్నారు.

భారతీయులందరూ ఒకరే.. మానవత్వం ఒకటే.. హింస నశించాలి.. ప్రేమ పరిణామిల్లాలి.. ఒకరినొకరు ప్రేమించాలి.. శాంతి స్థాపన జరగాలి..నాటి యేసు క్రీస్తు ప్రభోధం.. నేడు మా నినాదంతో క్రైస్తవులందరూ భారతదేశమంతట ఐక్యతతో ఈ రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సందర్భంగా తెలిపారు. కులాలకు మతాలకు అతీతంగా మానవత్వం వర్ధిల్లాలని అన్నారు. రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా నాయుడు పెట్రోల్ పంప్ జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ రన్‌ఫర్ జీసస్ ర్యాలీ శంభునిపేట జంక్షన్ నుంచి ఖిలా వరంగల్ పెట్రోల్ పంప్ మీదుగా..కాశీబుగ్గ జంక్షన్, పోచమ్మ మైదాన్, ఎంజీఎం సర్కిల్, ములుగు రోడ్డు జంక్షన్, హనుమకొండ చౌరస్తా, హనుమకొండ మిషన్ హాస్పిటల్ వరకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఖిలా వరంగల్ మండలం పాస్టర్స్ ఫెల్లోషిప్ ప్రెసిడెంట్ శామ్యూల్,సెక్రటరీ సూర్య జడ్సన్,ట్రెసరర్ అరుణ్, ఇతర కార్యవర్గ సభ్యులు, పలువురు పాస్టర్లు, డివైన్ గ్రేస్ అసెంబ్లీ విశ్వాసకులు,తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల గ్రామ కమిటీ ఎన్నిక

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలంలోని మైలారం గ్రామ ఉద్యమకారుల గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి రవీందర్, ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుదిపాల జోగిరెడ్డి, ఉపాధ్యక్షుడు అరికిల్ల వీరయ్య, ప్రధాన కార్యదర్శిలు గొర్రె కుమారస్వామి, దూదిపాల రాజిరెడ్డి, కోశాధికారి బొంతల నాగరాజు, కార్యవర్గ సభ్యులు దూది పాల రాంరెడ్డి, సోంటెడ్డి శంకర్, బొంతల సాంబయ్య, ఆకారపు ఐలయ్య, బొంతల భిక్షపతి లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెబోయిన సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ సమస్యలు అన్ని పరిష్కరిస్తాం

వేద న్యూస్, ఎల్బీనగర్ ప్రతినిధి :



రంగారెడ్డి జిల్లా ఎల్బి నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పార్థివాడా(పిట్టలబస్తి) బస్తీవాసుల కోరిక మేరకు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా బస్తివాసులు పలు సమస్యలను సుధీర్ రెడ్డికి వివరించారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యల కారణంగా చిన్నపాటి వర్షానికి డ్రైనేజీ పొంగిపొర్లుతున్నాయి అని అన్నారు. అలాగే రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరగా వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి మీ యొక్క కాలనీ డ్రైనేజీ విషయంలో ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.పక్కన ఫ్లై ఓవర్ నుంచి తీసుకొనిపోయి పక్కన ఉన్న కృష్ణ నగర్ పక్కన ఉన్న డ్రైన్స్ దగ్గర కలపడం జరుగుతుంది అని తెలిపారు. అనంతరం రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి,డివిజన్ భారస అధ్యక్షులు చింతల రవికుమార్,పార్థివాడ కాలనీ అధ్యక్షులు శక్తి కిషోర్,బబ్లూ,అజయ్,రాజ్ కిరణ్,మహేష్,లోకేష్,ఊర్వశి తదితరులు పాల్గొన్నారు అని తెలిపారు.

## భూభారతి చట్టం అమలకు
# అధికారులు సన్నద్ధం కావాలి

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్.. ప్రజలు, రైతులకు శాపంగా పరిణమించిందని, అప్పటి ప్రభుత్వ లోప భూయిష్టమైన విధానాలతో రైతులు కొత్త పాసుబుక్కులు పొందలేక.. పాసుబుక్కులు ఉన్న రైతులు రిజిస్ట్రేషన్లకు నోచుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని టీపీసీసీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం చరవాణి ద్వారా మెట్ పల్లి లోని స్థానిక విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతితో కొత్త శకం మొదలైందని, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో తెలంగాణ యావత్ రైతాంగానికి ప్రధాన సమస్యగా మారిన ధరణి పోర్టల్ ను రద్దుచేసి, భూభారతి చట్టం అమల్లోకి తేవడం పై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి, ఇందుకు కృషి చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భూభారతి చట్టం అమలుపై జిల్లా అధికార యంత్రాంగం.. స్థానిక సంబంధిత అధికారుల తో రివ్యూ కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన పెంచాలని, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రాలలో స్థానిక ప్రజా ప్రతినిధులు.. రైతులు, ప్రజలతో కలసి సంయుక్తంగా వీలైనన్ని సమీకృత సమావేశాలు నిర్వహించడం ద్వారా ప్రజలలో విస్తృతంగా ప్రచారం కల్పించాలని కోరారు. భూభారతి చట్టంపై సంబంధిత రెవెన్యూ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉన్నప్పుడే ఆయా చట్టం యొక్క గెజిట్ రూల్స్ ను ప్రజలకు వివరించడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు.

# ప్రభుత్వం రైతులను వెంటనే ఆదుకోవాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



రాష్ట్రంలో వివిధ జిల్లాలలో అకాల వర్షాలతో వడగళ్ళ వానలు, ఈదురు గాలులతో, పిడుగులు పడడంతో నష్ట పోయిన రైతు కూలీలను పేదలందరిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనేక ప్రాంతాలలో ఇటీవల అకాల వర్షాలు, గాలి దుమారం ప్రకృతి బీభత్సంతో జరిగిన నష్టాన్ని ప్రభుత్వ అధికారులు యుద్ధ ప్రాతి పదికన పరిశీలించి అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయి కష్టాల పాలైన శ్రమజీవులైన వారందరికి నష్టపరిహారంచెల్లించటంతో పాటు ఆ కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని వెంకట్రాములు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# నగరంలో తాటి ముంజలకు బలే గిరాకి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**




వేసవి సీజన్లో మాత్రమే లభించే అరుదైన తాటి ముంజలకు ఎంతో ప్రత్యేకత ఉంది జెల్లీ లాగా మృదువుగా ఉండే వీటిని ఐస్ ఆపిల్ అంటారు. గతంలో పల్లెలలో ఉచితంగా లభించే తాటిముంజలకు నేడు నగరంలో భలే గిరాకీ ఉంది. డజన్ ముంజలు 100 రూపాయలకు అమ్ముతున్నారు. ఎండాకాలంలో మాత్రమే అందుబాటులో ఉండే ఈ ముంజలకు చిన్న పెద్ద అని తేడా లేకుండా అందరూ ఫిదా అవ్వాల్సిందే. ఒంటికి చలువ చేస్తుందని అందరూ కొంటూ ఉండడంతో వీటికి గిరాకీ పెరిగింది. దీనితో ధరలు బాగా పెరిగాయి. నగరంలోని పలు కూడళ్ళలో వీటిని అమ్ముతూ పల్లె వాసులు కనిపిస్తారు. కేవలం తినడానికి బాగుంటాయని చలువ చేస్తుందని మాత్రమే కాదు దీనిలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా దాగి ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**– తాటి ముంజలకు వేసవి సీజన్**

వేసవిలో మాత్రమే ఇవి లభిస్తాయి ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో పొలం గట్ల పైకి వెళ్లి గెలలు కోసుకొని లొట్టలేసుకొని తింటారు. నగర శివారు ప్రాంతాలు జిల్లాల నుంచి తాటికాయలు కోసుకొచ్చి నగరంలో పలు కూడళ్ల వద్ద విక్రయిస్తున్నారు. వేసవికాలంలో వీటిని తింటే వేసవికాలంలో శరీరానికి మంచి చేస్తుందని అంటారు. ఈ ముందలు దాహార్తి తీరుస్తుందని అందరూ కొనుక్కొని తినడానికి మక్కువ చూపిస్తూ ఉంటారు ముజలలో నీటి శాతం అధికంగా ఉండడంతో వీటిని తింటే డిహైడ్రేషన్ భారిన పడకుండా కాపాడుకోవచ్చునని వేసవిలో శరీరానికి కావలసిన కనియాలు చక్కెరను బ్యాలెన్స్ చేస్తాయని ఇప్పటికే పలువురు న్యూట్రిషన్లు సైతం చెబుతున్నారు.వీటిలో అధిక మొత్తంలో ఉండే విటమిన్ బి ఐరన్ క్యాల్షియం లభిస్తుందని చెబుతున్నారు. ఇవి సులభంగా జీర్ణం అవ్వడమే కాకుండా రుచిలో కూడా లేక కొబ్బరి లా ఉండడంతో వీటిని పిల్లలు పెద్దలు అందరూ ఇష్టంగా తింటున్నారు. రెండు నెలల పాటు మంచి గిరాకీ ఉంటుందని నాలుగు రాళ్లు సంపాదించుకుంటామని మంచి గిట్టుబాటు కూడా ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

## జాతీయస్థాయిలో ర్యాంకులు
# సాధించిన రేస్ ఐఐటి అకాడమీ

**వేద న్యూస్, కోదాడ టౌన్ :**



దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ ప్రవేశాల కొరకై నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరి సెషన్ 2 ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కోదాడ రేస్ ఐఐటి అకాడమీ చైర్మన్ బాణాల వసంత వెంకటరెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో అత్యధిక పర్సంటైల్ తో పాటు ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎస్.డి హుజైఫా ఆల్ ఇండియా స్థాయిలో 3,469 వ ర్యాంకు, టి రోహిత్ రెడ్డి 4,160, ఎస్ దీక్షిత 4,635వ ర్యాంకు, పి సూర్యప్రకాష్ 6,253వ ర్యాంకు, సిహెచ్ కుషాల్ సాయి స్వరూప్ రెడ్డి 8,241 ర్యాంకు సాధించారు. కాగా విద్యార్థులను తల్లిదండ్రులు, అధ్యాపకులతో కలిసి అభినందించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వర్గీయ బాణాల వెంకట్ రెడ్డి ఆశయాల సాధన మేరకు ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుండా ఉండాలని గ్రామీణ ప్రాంత పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటు ఫీజులతో కోదాడలోనే రేస్ కళాశాల స్థాపించి కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామని తెలిపారు. పక్కా ప్రణాళిక అంకితభావంతో తమ కళాశాల అధ్యాపకులు పనిచేయడం వల్ల ఈ విజయం సాధ్యమైందన్నారు. గతంలో కూడా అనేక ప్రవేశ పరీక్ష ఫలితాలలో తమ రేస్ కళాశాల విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రిషి మ్యూజికల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి:**

రిషి మ్యూజికల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు కళా సుబ్బారావు కళా వేదిక త్యాగరాయ గాన సభలో గాన కోకిల ఎస్ జానకి జన్మదినోత్సవ సందర్భంగా జానకమ్మ ఆలపించిన సినీ గేయాలను 36 మంది ఔత్సాహిక గాయనీ గాయకులు తమ గానంతో స్వరార్చన చేయనున్నారని రిషి మ్యూజికల్ ఈవెంట్స్ అధినేత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంగీత విభావాన్ని అధిక సంఖ్యలో జానకమ్మ అభిమానులు హాజరై జయప్రదం చేయాలని వినరాపూర్వక స్వాగత సుమాంజలి పలుకుతున్నట్లు యోగిత తెలిపారు.

# జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన నారాయణ విద్యార్థినిలు

**వేద న్యూస్, హన్మకొండ :**




హన్మకొండ జిల్లా నక్కలగుట్టలలో ఉన్న నారాయణ హై స్కూల్ విద్యార్థినిలు అంతర్జాతీయ స్థాయిలో 2024-2025 విద్య సంవత్సరంలో నిర్వహించిన సినాప్స్ ఓలింపియాడ్ పోటీ పరీక్షలలో విద్యార్థులు ప్రతిభ కనబారిచారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో హన్మకొండ జిల్లా నారాయణ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు ఎం సిరి ఎర్-2 ర్యాంక్, బి శృతి ఎర్-3 ర్యాంక్, ఇ సరయు-4 ర్యాంక్, తరకేశ్వరి -6 ర్యాంక్, శివాని- 7 ర్యాంక్, ఐదు బహుమతులు కై వసం చేసుకున్నారు. శనివారం నారాయణ విద్య సంస్థల జనరల్ మేనేజర్ గోపాలరెడ్డి చేతుల మీదుగా బహుమతులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జోన్ డిజిఎం రిజ్వానా ఇమ్రాన్, ఆర్ఐ శ్రీనివాసా చారి, ప్రిన్సిపల్ వి అలేఖ్య, కో ఆర్డినేటర్ సాయి కృష్ణ డిన్ రాజశేఖర్, ఏ ఓ ఎండి ఆదిల్ తదితరులు ఉన్నారు.

# దళితబిడ్డకు న్యాయం జరగాలి

**వేద న్యూస్,దామరచర్ల :**



నల్గొండజిల్లా నిడమనూరు మండలం బక్కమంతలపాడు గ్రామానికి చెందిన దళితబిడ్డ ధర్మారపు మల్లేశ్వరి ఆత్మహత్యకు గురైన విషయం తెలిసిందే.ఆమె ఆత్మహత్యకు కారకుడైన జాన్ రెడ్డి పై మర్డర్,అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ధర్మసమాజ్ పార్టీ దామరచర్ల మండల అధ్యక్షులు గద్దలసైదులు డిమాండ్ చేశారు. ధర్మారపు మల్లేశ్వరిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.సహజీవనం చేసి వేరే పెళ్లి చేసుకున్న బాధితుడుతో పాటు కుటుంబ సభ్యులపై మర్డర్ కేసు,అట్రాసిటీ కేసు నమోదు చేయాలని,వారందరిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.అగ్రకుల అహంకారానికి బలైపోయిన ధర్మపురి మల్లేశ్వరి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు, పోరాటం చేస్తామని తెలిపారు. నిందితుడ్ని కాపాడేందుకు రెడ్డి సామాజిక వర్గం ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామని రాష్ట్రం మొత్తం నిరాహార దీక్షలు,ధర్నాలు చేపడతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం..పర్యావరణాన్ని కాపాడుదాం

**వేద న్యూస్, కోదాడ :**

కోదాడ పట్టణంలోని పీఎం శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం..అని స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మండల విద్యాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి. సలీం షరీఫ్ పాల్గొని మాట్లాడారు.విద్యార్థులు ఉపాధ్యాయులు సమిష్టి కృషితో పాఠశాల ఆవరణ పరిశుభ్రత కోసం కృషి చేయడం పాఠశాల ఆవరణలో మెడికల్ ప్లాంట్స్, ఫ్లవర్ ప్లాంట్స్, ఆకుకూరలు కూరగాయల కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి సంరక్షణ చేయడం వల్ల ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రిస్తే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అని అన్నారు.స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.ఇలాంటి కార్యక్రమాలు వలన విద్యార్థి దశ నుండే పని అనుభవం శ్రమ పట్ల గౌరవభావం అవగాహన ఏర్పడతాయని తెలిపారు. పాఠశాలలోని ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ రాష్ట్రీయ ఆవిష్కార్ సప్త హ్ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రీన్ షర్టులు, క్యాప్ లు ధరించి పాఠశాల ఆవరణలో ఉన్న మొక్కలు నీటి సరఫరా సంరక్షణ పద్ధతులను పరిసరాల పరిశుభ్రత విషయాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ, జిల్లా సైన్స్ అధికారి




ఎల్ దేవరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు ఇబ్రహీంపట్నం బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం



వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి:

రంగారెడ్డి జిల్లా పరిధిలోని నియోజకవర్గాలలో ఇబ్రహీంపట్నం ఒక ప్రధానమైన నియోజకవర్గం అని అందుకే అక్కడ బ్రాహ్మణ సంఘాల అన్నింటినీ ఒకే తాటిపైకి తెచ్చి బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించాలని నిర్ణయానికి వచ్చినట్లు రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మంగు రాఘవరావు తెలిపారు. ఈ నేపథ్యంలో తుర్కయంజాల్ టీచర్స్ కాలనీ కమ్మగూడ శ్రీ సాయి గణేష్ మందిర్ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు కార్యక్రమంలో బ్రాహ్మణ బంధువులంతా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమం అనంతరం చక్కటి విందు భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని మంగు రాఘవరావు తెలిపారు.

# 'చేనేత' కళను ప్రపంచానికి చాటేలా..

- మిస్ వరల్డ్ పోటీల్లో ప్రయారిటీ
- సీఎం రేవంత్‌కు పద్మశాలి సొసైటీ ధన్యవాదాలు

**వేద న్యూస్, హన్మకొండ :**



వచ్చే నెల 7 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో జరగనున్న మిస్ వరల్డ్-2025 పోటీలలో 'తెలంగాణ చేనేత కళలకు' ప్రాధాన్యతను ఇవ్వడం పట్ల న్యాయవాది తులసిదాస్, పోపా నాయకులు అంజయ్య, అఖిల భారత పద్మశాలి సొసైటీ విద్యావంతుల వేదిక కార్యదర్శి జన్ను ప్రవీణ్, వేణు, ప్రదీప్, భాస్కర్, వెంకట రామయ్య, నాగభూషణం, రేవంత్ సైన్యం జాతీయ ప్రధాన కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు శనివారం ఓ ప్రకటన రిలీజ్ చేశారు. ఈ పోటీలకు వచ్చే 140 దేశాల ప్రతినిధులకు భారత సౌందర్యం తెలిపేలా చీరలకు ప్రాధాన్యత కల్పిస్తూ.. లక్ష్మి నరసింహస్వామి వారి ఆలయంలో పాల్గొనే మహిళలు చేనేత చీర ధరించి దర్శనం చేసేలా ఆదేశాలు ఇవ్వడం సంతోషకరమని వెల్లడించారు. మిస్ వరల్డ్ పోటీల్లో చేనేత థీమ్ ప్రత్యేకంగా నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణకు నూతన డీజీపీగా ఓ మహిళా ఐపీఎస్ అధికారిని నియమించి.. మహిళలకు ఉన్నత స్థానం కల్పించాలని కోరారు.

# రైతులకు అదనపు రుణాలు అవసరం




- మంజూరుకు ఒప్పుకున్న బ్యాంకర్లు
- ఫార్మర్స్ ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- టీఆర్ఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్

**వేద న్యూస్, హుజూరాబాద్:**

రైతులకు అదనపు రుణాలు అవసరమని, వాటి మంజూరుకు బ్యాంకర్లు ఒప్పుకున్నారని తెలంగాణ రైతు రక్షణ సమితి (టీఆర్ఆర్ఎస్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్ పేర్కొన్నారు. ఫార్మర్స్ ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. న్యాయ సేవ అధికార సంస్థ, హైదరాబాద్, జిల్లా న్యాయ సేవ సంస్థ, కరీంనగర్ వారి ఆదేశానుసారం మండల న్యాయ సేవ కమిటీ, చైర్మన్, హుజురాబాద్ వారి ఆధ్వర్యంలో హుజురాబాద్ కోర్ట్ ఆవరణలో రైతు రక్షణ సమితి, వ్యవసాయ అధికారుల సహకారంతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్‌లో రైతులకు పంట రుణాలకు ఆధారంగా దీర్ఘకాలిక రుణాలు అవసరం ఉన్న నేపథ్యంలో.. వారి పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ హైకోర్ట్‌లో తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు ప్రజా ప్రయోజన వాజ్యం వేశారు. దానికి సంబంధించి మండల న్యాయ సేవ కమిటీ, హుజురాబాద్ కోర్ట్ ఆవరణలో మీటింగ్ ఏర్పాటు చేశారు. మండల న్యాయ సేవ కమిటీ, చైర్మన్, హుజురాబాద్ పి.బి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. బ్యాంకుల నుంచి పంట రుణాలకు ఆధారంగా దీర్ఘకాలిక రుణాలు అవసరం ఉందని, రైతులు రుణ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులందరూ ప్రైవేటు అప్పులు తీర్చుకోవడానికి రుణాలు మంజూరు చేయడానికి బ్యాంకర్లు సైతం ఒప్పుకున్నారని వెల్లడించారు. తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ మాట్లాడుతూ.. ప్రైవేటు అప్పుల బాధతో ఉన్న రై తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఏడీఏ సునీత, ఎస్బీఐ చీఫ్ మేనేజర్ మానకొండూరు, వివిధ బ్యాంకు మేనేజర్లు, వ్యవసాయ అధికారులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## అంజిరెడ్డి రివర్ హాస్పిటల్‌లో

# ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**




మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్ అంజిరెడ్డి రివర్ హాస్పిటల్ లో ఆరోగ్య శ్రీ పరిధిలో అన్ని రకాల వైద్య సేవలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్.ఎల్.శ్రీనివాస్ రెడ్డి ఎమ్ ఎస్( గాస్ట్రో సర్జన్ ) తెలిపారు. శనివారం డా.అంజిరెడ్డి రివర్ హాస్పిటల్ లో డాక్టర్.ఎల్ఎస్.శ్రీనివాస్ విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ అంజిరెడ్డి రివర్ ఆస్పత్రిలో గుండెకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు కూడా మే మొదటి వారంలో నూతనంగా ప్రారంభిస్తున్నామని,కిడ్నీ సంబంధిత అంశాలు,మొట్ట మొదటి సారిగా ఇఎన్టి సేవలు మరియు న్యూరో సర్జన్,న్యూరాలజీ,జనరల్ మెడిసిన్,జనరల్ సర్జరీ విభాగాలను కూడా మన వద్ద ఆరోగ్యశ్రీలో చేర్చినట్లు తెలిపారు.వీటితో పాటుగా తమ ఆసుపత్రిలో సిటీస్కాన్,డయాలసిస్,మరియు అన్ని రకాల వైద్య సేవలు 24 గంటలు అందుబాటులో ఉన్నాయని,ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వైద్య సేవలు ప్రారంభించిన అతి తక్కువ సమయంలోనే గుర్తింపు పొందిన ఐఎస్ఓ ధ్రువీకరణ పత్రం కూడా ఆసుపత్రికి లభించినట్లు వివరించారు.త్వరలోనే తమ ఆసుపత్రిలో నాణ్యమైన సేవలు విస్తరించి ఎన్ఎబిహెచ్ ధ్రువీకరణ పత్రం కూడా పొందేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.ఈసమావేశంలో అనుభజ్ఞులైన డాక్టర్ల బృందం అయిన డా.నవీన్ కుమార్,డా.రామ్ నాథ్ రెడ్డి,డా.శ్రీరామ్ రాజు,డా.శ్రీనివాస్ రెడ్డి,డా.ప్రశాంత్ లతో పాటు అడ్మినిస్ట్రేషన్ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్ లో జయ విద్యార్థుల విజయభేరి

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**

శనివారం విడుదలైన జేఈఈ మెయిన్స్-2025 పరీక్షా ఫలితాలలో జయ జూనియర్ కళాశాల నుండి అన్ని క్యాటగిరి ర్యాంకులతో కలిపి 58 మంది ఐ.ఐ.టి. జె.ఈ.ఈ అడ్వాన్స్ కు అర్హత సాధించారని జయ కాలేజ్ యాజమాన్యం తెలిపారు. కన్నా ఉజ్వన్ గణితంలో 99.969 పర్సంటైల్ సాధించాడని, జయ జూనియర్ కళాశాలలో జరిగే అత్యుత్తమ ప్రోగ్రామ్, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనతో ఈ ఫలితాలు సాధించగలిగామని కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు.



B.SHIVA MANI



V.BINDU MADHAVI



CH. HANSHITHA SRI



G.TEJA SRI



K.UJWAN

**జి.తేజశ్రీ ఆల్ ఇండియా 1622 ర్యాంకు,**
**కె.ఉజ్వన్ ఆల్ ఇండియా 2254 ర్యాంకు,**
**వి.బిందుమాధవి ఆల్ ఇండియా 2541ర్యాంకు,**
**సి.హెచ్.హన్షితశ్రీ ఆల్ ఇండియా 2651 ర్యాంకు,**
**బి.శివమణి ఆల్ ఇండియా 2769 ర్యాంకు,**
**జె.మేనక ఆల్ ఇండియా 8319 ర్యాంకు,**
**డి.జగదీష్ రాజు ఆల్ ఇండియా 9498 ర్యాంకు,**
**పి.ప్రేమ్ చంద్ ఆల్ ఇండియా 9863 ర్యాంకు**

సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభను కనపరిచిన విద్యార్థులను కృషి చేసిన అధ్యాపక బృందాన్ని కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ డైరెక్టర్లు జెల్లా పద్మ బింగి జ్యోతి లు అభినందించారు.

# సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- వైద్యాధికారి డా. సుచరిత

**వేద న్యూస్, మాడ్గులపల్లి:**



సమతుల ఆహారంతో గర్భిణులు బాలింతలు చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యవంతులావుతారని వేములపల్లి మండల వైద్యాధికారిడా.సుచరిత అన్నారు.ఐసీడీఎస్ దామరచర్ల ప్రాజెక్టు మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ సెక్టరు పరిధిలోని సీత్యాతండ, మాడ్గులపల్లి సెక్టర్ గజాల పురం అంగన్వాడి కేంద్రాలలో శనివారం నిర్వహించిన పోషణ పక్వడా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సీత్యాతండ అంగన్వాడీ కేంద్రములో జరిగిన కార్యక్రమంలో వేములపల్లి మండల వైద్యాధికారి డా.సుచరిత పాల్గొని గర్భిణీలు బాలింతలు, కిషోర బాలికలు తీసుకోవాల్సిన ఆహార నియమాలు పాటించాల్సినఆరోగ్యసూత్రాలపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం లోని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.ఈ కార్యక్రమం ఐసిడిఎస్ ఆగమోత్కూర్ సెక్టర్ సూపర్వైజర్ నాగమణి ,గ్రామ పంచాయతీ కార్యదర్శి కావ్య,ఎఎన్ ఎం ఝాన్సీ, ఆశ వర్కర్ మంగమ్మ,అంగన్వాడీ టీచర్లు వంకుడోతు గీత , వడ్డే సరిత-సత్యమ్మ,విఓఏ, తల్లులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని గజలాపురం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో మాడ్గులపల్లి సెక్టర్ సూపర్ వైజర్ లక్ష్మి పాల్గొని సమతుల ఆహారంపై గర్భిణీలు బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ జానకమ్మ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# చిరు ప్రాణానికి తృణ ధాన్యాలతో ఎదుగుదల



వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :

పౌష్టిక ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చునని, అదేవిధంగా చిరు ప్రాణానికి ఎదుగుదల ఉంటుందని డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం సెక్టర్ బంగారుగడ్డ (3) అంగన్వాడి సెంటర్ నందు సిడిపిఓ మమత ఆదేశానుసారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా మిర్యాలగూడ సామాజికకార్యకర్త, స్నేహశీలి,మృదుస్వభావం కలిగిన డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ పాల్గొని మాట్లాడారు. గర్భిణీ బాలింతలకు ఆరు సంవత్సరాల తల్లులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషణ ఉండే ఆహార పదార్థాలు ఇవ్వాలని, పండ్లు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి తెలిపారు. అదేవిధంగా పుట్టిన పసిపిల్లలకు తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని,పిల్లలకు బయటి ఆహార పదార్థాలను అలవాటు చేయకుండా ఇంట్లోనే పిల్లలకు చిరుధాన్యాలతో వండి పెట్టడం వల్ల పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది అని వారన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంటే ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని, ఆరోగ్యమే మహా బలమని అన్నారు.ఈ కార్యక్రమంలో మెప్మా అధికారి బక్కయ్య,వెంకటేశ్వర్లు, అంగన్వాడీ టీచర్ మల్లీశ్వరి, కలమ్మ, కామేశ్వరి ,వరమ్మ,లక్ష్మీదేవి, చాంద్ సుల్తానా,షాహిద్,ఆర్ పి సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీహాన్ హాస్పిటల్ వైద్యుల ఘన విజయం



వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:

సూర్యాపేట మండల పరిదిలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన షేక్ షబానా 22 సంవత్సరాలు ఆమెకు మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. నాటి నుంచి సంతానం కోసం అనేక హాస్పిటల్స్ తిరిగి అనేక ఇబ్బందులు పడ్డారు. చివరగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీహాన్ హాస్పిటల్ లో సంతాన చికిత్స పొంది చివరకు గర్భం దాల్చారు. ఆమెకు బిపి, షుగర్ థైరాయిడ్ తో భాధపడుతూ ఉండటం వలన శ్రీహన్ హాస్పిటల్ డాక్టర్. విజితగిరిధర్ రెడ్డి హైరిస్కు ప్రెగ్నెన్సీ గా అడ్మిట్ చేసుకొని సిజరిన్ చేయగా ఒకే కాన్పులో ముగ్గురు జన్మించడం జరిగింది. (ఇద్దరు మగ శిశువులు ఒక ఆడ శిశు వు. (1.8 1.5 1.5) కేజీల బరువు ఉన్నట్లు చెప్పారు. గతంలో కూడా ఎన్నో హైరిస్కు కేసులు చేసి అందరి మన్ననలు పొందారు. తల్లి బిడ్డలను సురక్షితంగా డిస్చార్జ్ చేయడం జరిగిందన్నారు. ఈలాంటి కాన్పులు చాలా అరుదుగా జరుగుతుంది అని డాక్టర్.విజిత గిరిధర్ రెడ్డి చెప్పారు. తల్లి పిల్లలు ఆరోగ్యంగా ఉన్నట్టు శ్రీహాన్ హాస్పిటల్ డైరెక్టర్. డాక్టర్ గిరిధర్ రెడ్డి తెలిపారు. వారి బంధు మిత్రులు సంతోషం వ్యక్తం చేస్తూ డాక్టర్ విజితగిరిధర్ రెడ్డి కీ కృతజ్ఞతలు తెలిపారు.



## భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య

**వేద న్యూస్, కోదాడ ప్రతినిధి:**

సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం రామాపురం గేట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి కాలేజ్ భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న చిలుకూరు ఎస్సై సురభి రాంబాబు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన బిటెక్ సెకండియర్ చెందుతున్న విద్యార్థిని కృష్ణవేణి ఉగాది పండుగకు ఇంటికి వెల్లి మరలా శుక్రవారం సాయంత్రం తన తల్లితో కలిసి కళాశాలకు వచ్చింది. కాగా తల్లితో కలసి రాత్రి హాస్టల్లో పడుకుంది. శనివారం తెల్లవారుజామున కాలేజ్ భవనం పై దూకి హత్మహత్య చేసుకున్నది. అనుమానాస్పద మృతిగా భావించి ఎస్సై రాంబాబు పోలీసులు బలగాలతో దర్యాప్తు చేస్తున్నామని పూర్తి వివరాలను దర్యాప్తు తర్వాత తెలియపరుస్తామని అన్నారు.

## రైతులను మభ్యపెడుతున్న ప్రభుత్వం

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి:**



కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజులు చేస్తానని మభ్య పెట్టే మాటలు చెబుతుంది కానీ, ఆచరణలో మాత్రం రైతును రాజును కాదు కదా రైతును దివాలా తీయిస్తున్నారని భారతీయ జనతా పార్టీ నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షులు చందుపట్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఓ ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గత మాసంలోనే ఐదు లక్షల వరకు రైతుల రుణమాఫీ చేస్తానని చెయ్యలేదని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ధాన్యం కొనుగోలులో కూడా ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కూడా సక్రమంగా జరగడంలేదని ప్రభుత్వం చెప్పే మాటలకు చేతలకు చాలా తేడా ఉందని వెంకటేశ్వరరావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
### పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

నల్లగొండ జిల్లా దేవరకొండ సబ్ డివిజన్ చందంపేట మండలంలోని పోలేపల్లి గ్రామంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కామినేని హాస్పిటల్ వైద్య బృందం, జె.జె.యం హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తో కలిసి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రారంభించారు. ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంపులో జరనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జరీ, గైనకాలజిస్ట్, ఆప్తాల్మాలజిస్ట్, ఆర్థోపెడిక్, డెంటల్, డయాబెటిస్, ఈసీజీ స్కానింగ్, లాంటి ప్రత్యేక 15 మంది డాక్టర్ల బృందం చేత పరీక్షలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాదాపు 1500 మంది వివిధ రకాల సమస్యలతో రోగులు వచ్చారని తెలిపారు. వారందరికీ పరీక్షలు నిర్వహించి వివిధ రకాల సమస్యలు పై దాదాపు 60 వేల రూపాయల మందులు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. మారుమూల గ్రామాల గిరిజన ప్రజలకు సరైనా హాస్పిటల్స్ అందుబాటులో లేక అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పైన దృష్టి పెట్టాలని పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పి మౌనిక ఐపీఎస్, డిండి సి.ఐ సురేష్, చందంపేట ఎస్సై సతీష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## పశ్చిమ బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలి

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి:**

జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణం విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల కు వ్యతిరేకంగా అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.... భారతదేశం హిందువుల దేశమని ఇక్కడ కొంతమంది మతోన్మాదులు వేరే దేశాల నుండి పశ్చిమ బెంగాల్ వలస వచ్చి మత చిచ్చు రగిలించి హిందువులపై దాడులకు ఉసిగొల్పుతూ ప్రజల మధ్య అల్లర్లకు దారితీస్తున్నారని అన్నారు. దాంతో కేంద్ర ప్రభుత్వం బిఎస్ఎఫ్ జవాన్లను అక్కడికి పంపి అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకుంటూ ఉంటే రాష్ట్ర ముఖ్యమంత్రి హిందువులకు ముస్లింలకు మధ్య చిచ్చు పెడుతూ వ్యాఖ్యలు చేయడంతో దేశవ్యాప్తంగా వి హెచ్ పి, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో హిందువులపై దాడులకు నిరసిస్తూ పశ్చిమ బెంగాల్ లో రాష్ట్రపతి పాలన తక్షణమే ఏర్పాటు చేయాలనీ కేంద్ర ప్రభుత్వానికి విన్నవించుచు స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశామన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి గజం రాజు, చెట్పల్లి శంకర్, గట్ల శివ, రుద్ర శ్రీనివాస్, పెండెం గణేష్, సుధావేణి మహేష్, వినయ్ కుమార్, సాగర్ పాల్గొన్నారు.





# కార్యశీలురు.. మనోహర్‌రావు

- విషయ పరిజ్ఞానమున్న నేత
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పరిస్థితులపై బలెరావుకు అవగాహన
- సీనియర్ లీడర్ సేవలను కాంగ్రెస్ ఉపయోగించుకోవాలని విజ్ఞప్తులు

**వేద న్యూస్, భూపాలపల్లి :**

భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన బలెరావు మనోహర్‌రావు.. రాజకీయ ప్రస్థానం ఒడిదుడుకుల మధ్య అనేక ఆటుపోటులను అధిగమిస్తూ.. సాగుతున్నదిగా చెప్పొచ్చు. విషయ పరిజ్ఞానం మెండుగా కలిగిన సీనియర్ నాయకుడిగా ఉన్న మనోహర్‌రావు.. నాటి ఉమ్మడి వరంగల్ జిల్లా.. ప్రస్తుత విభజిత జిల్లాలోని పలు అంశాలపై అవగాహన ఉన్న నేతగా ఉన్నారు. అయితే, రాజకీయాల్లో ఆయన పదవుల కంటే కూడా ప్రజలకు అవసరమయ్యే పనులు జరగాలనే స్వభావంతో ముందుకు సాగడంతో పాటు కొందరి రాజకీయ ఎత్తుగడల వల్ల.. పదవులు తన వరకు చేరలేదని బలెరావు మనోహర్‌రావు పేర్కొంటున్నారు.



### విషయపరిజ్ఞానం కలిగిన లీడర్

సాగునీరు, తాగునీరుతో పాటు విద్యుత్ కోతలను నివారించాలని డిమాండ్ చేస్తూ 1990ల్లోనే నాటి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రిలేనిరాహార దీక్షలు నిర్వహించడంలో కీలకంగా వ్యవహరించిన నేత బలెరావు మనోహర్‌రావు. కాంగ్రెస వాదిగా పేరుగాంచి నాటి ఉమ్మడి వరంగల్ జిల్లాలో కీలక నాయకుడిగా పేరు సంపాదించారు. కాంగ్రెస్ పార్టీ యాక్టివిటీస్‌ను క్రమశిక్షణతో నిర్వహించి.. కార్యదక్షుడిగా అధిష్టాన ప్రశంసలు సైతం పొందారు. నాటి ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకుడిగా బలెరావు మనోహర్‌రావు.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులే కాదు.. సోనియాగాంధీతో పాటు ఇతర జాతీయ స్థాయి నాయకులు జిల్లాకు వచ్చిన క్రమంలో పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేయడంలో శక్తి వంచన లేకుండా కృషి చేశారు. ఈ క్రమంలో తాను ఆర్థికంగా కరిగిపోయినా చేతబూనిన మూడు రంగాల హస్తం పార్టీ జెండాను ఎగురవేయడానికి మొగ్గుచూపారు. ఆరె హక్కుల పోరాట సమితి పక్షాన, స్థానిక సమస్యలపైన పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ పోరుబాటలో నడిచారు. నాటి శాయంపేట సెగ్మెంట్ ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా పని చేసిన బొచ్చు సమ్మయ్య శిష్యుడిగా, వర్గీయుడిగా మనోహర్‌రావు ముందుకు సాగారు. అయితే, కాలక్రమంలో ఆయన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమం సందర్భంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన ఉద్యమకారుడు కుసుంబ గంగాధర్ అల్లుడైన బలెరావు మనోహర్‌రావు.. తన సతీమణి పద్మను జెడ్పీటీసీగా బరిలో దించారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఇక వారికి పార్టీలో సముచిత స్థానం లభించకపోయినా పార్టీకి కంకణబద్ధులై సేవలందించారు. ఇక ఆ తర్వాత పార్టీలో ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఆయా సమయాల్లో పార్టీలో ఉన్న నేతలను ఎమ్మెల్యేలుగా గెలిపించడంలో కీలకంగా వ్యవహరించారు. తనకు అక్కడ సముచిత స్థానం లభించడం లేదని గ్రహించిన మనోహర్‌రావు 2023 అసెంబ్లీ ఎన్నికల ముందర తిరిగి సొంతగూడు అయిన కాంగ్రెస్‌లో చేరారు. కొన్ని నెలల క్రితం బైక్ యాక్సిడెంట్‌కు గురై మంచానికి పరిమితమై ట్రీట్‌మెంట్ పొందిన మనోహర్‌రావు.. మెల్లగా కోలుకుంటున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యేగా గండ్ర సత్యనారాయణరావు గెలుపునకు శక్తి వంచన లేకుండా ప్రచారంలో తనవంతుగా మనోహర్‌రావు పాల్గొన్నారు.

### సీనియర్ నేత అనుభవాన్ని పార్టీ వినియోగించుకోవాలని విజ్ఞప్తులు

సీనియర్ నాయకుడిగా ఉన్న బలెరావు మనోహర్‌రావు సేవలను మరింత విస్తృతంగా ఉపయోగించుకుంటే కాంగ్రెస్ పార్టీకి ప్లస్ అవడంతో పాటు పది కాలాల పాటు పవర్‌లో ఉంటుందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీనియర్ నాయకుల అనుభవాన్ని పార్టీ వినియోగించుకోవాలని, తద్వారా పార్టీ మరింత బలోపేతమై పది కాలాలు ప్రజల్లో నిలబడుతుందని కొందరు అంటున్నారు.

నాటి ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ప్రస్తుతం భూపాలపల్లి సెగ్మెంట్ అభివృద్ధి పనులపై విషయ పరిజ్ఞానమున్న బలెరావు మనోహర్‌రావుకు ఏదైనా నామినేటెడ్ పదవి ఇస్తే.. ఉద్యమకారుడి కుటుంబానికి, సీనియర్ నాయకుడికి సముచిత గౌరవం లభించినట్టవుతుందని పలువురు వెల్లిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానానికి రిక్వెస్ట్ చేస్తున్నారు.

## గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలి

**వేద న్యూస్, కోదాడ రూరల్ :**




నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో గత ఆరు నెలలుగా కల్లుగీత కార్మికులను సాంఘిక బహిష్కరణకు గురిచేసిన వీడీసీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గౌడ మహిళలను శ్రీరామనవమి సందర్భంగా గుడి నుండి గెంటివేసి, గీత కార్మికులకు ఉపాధి కల్పించే ఈత చెట్లను కాల్చివేసిన దుర్మార్గులను తక్షణమే అరెస్టు చేయాలని అన్నారు. విడిసిలను నిషేధించాలని శనివారం సూర్యాపేట నేషనల్ హైవేపై రాస్తారోకో చేసి వీడీసీల దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీడీసీల ముసుగులో రాజ్యాంగేతరశక్తులుగా వ్యవహరించడమే కాకుండా దళితులు బలహీన వర్గాలను సాంఘిక బహిష్కరణలకు గురి చేస్తున్నారని అన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన సర్పంచులు ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారని, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లాంటి ఉన్నత అధికారులు వీడీసీల అరాచకాల పట్ల ఉదాసీనంగా ఉంటున్నారని అన్నారు. కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారిపై వీడీసీలు తమ ఆధిపత్యాన్ని అంగీకరించి అణిగిమనిగి ఉండాలని హుకుం జారీ చేస్తున్నారని అన్నారు. తాము చెప్పినట్టు వినని వారిపై సాంఘిక బహిష్కరణకు గురి చేస్తున్నారని అన్నారు. ఆరు నెలల క్రితం ఈ సాంఘిక బహిష్కరణ జరిగి గీత కార్మికులు నానా ఇబ్బందులు పడుతుంటే జిల్లా ఎస్పీ కలెక్టర్ ఆ జిల్లాలోని ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు? ఏప్రిల్ 6 న శ్రీరామనవమి సందర్భంగా పూజ కోసం గౌడ మహిళలు గుడికి వెళితే అవమానించి గుడి నుంచి గెంటి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి తమ గోడు వినిపించుకుందామని వారు వెళితే సుమారు 150 ఈత చెట్లను తగలబెట్టారని వాటి ద్వారా ఉపాధి పొందుతున్న వారి పొట్టలు కొట్టారని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో విలేజ్ డెవలప్మెంట్ కమిటీల అరాచకాల్ని ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు చెక్ పెట్టాలని వీడీసీలను నిషేధించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఉన్నత అధికారులు తక్షణమే ఆ గ్రామాన్ని సందర్శించి సాంఘిక బహిష్కరణ ఎత్తివేసి వీడీసీలను సమూలంగా నిషేధించాలని గ్రామాలలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. అందుకు పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చొరవ చూపాలన్నారు. ఈనెల 25న వేలాది మందితో చలో తాళ్ల రాంపూర్ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జెర్రిపోతుల కృష్ణ, బట్టుపల్లి నాగ మల్లయ్య, బోడపట్ల జయమ్మ, సంఘం జిల్లా కమిటీ సభ్యులు నోముల వెంకన్న, కారంగుల సైదమ్మ, మండల నాయకులు పబ్బు జానయ్య, ఇటికాల చిరంజీవి, విజయ, తండు సైదులు, కొండ ఎంకన్న, పబ్బు నాగయ్య, వీరస్వామి, పనస వెంకన్న మల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



### ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా
## అక్కినపల్లి వినయ్

**వేద న్యూస్, సూర్యాపేట :**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన అక్కినపల్లి వినయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏప్రిల్ 18న సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన ఎస్ఎఫ్ఐ నాలుగో మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. వినయ్ ఇంతకు ముందు జిల్లా కమిటీ సభ్యుడుగా, జిల్లా ఉపాధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా అక్కినపల్లి వినయ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తూ సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని విస్మరించాయని విద్యారంగాన్ని కాపాడుకోవడానికి విద్యార్థులు సమరశీల పోరాటాలను నిర్వహించాలన్నారు. ఈ మహాసభలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ పాల్గొన్నారు.




Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073